నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 5 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

## ఎంపీ వద్దిరాజు దాతృత్వం

### వరద బాధితులకు విరాళంగా నెల వేతనం


రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, సెప్టెంబర్ 4 : ఖమ్మం నగరంలోని మున్నేరు వరద బాధితుల కోసం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమ, మంగళవారాల్లో మున్నేరు లోతట్టు ప్రాంతంలో వరద బాధితులను పరామర్శించి కొండంత అండగా నిలిచిన విషయం తెలిసిందే. ముంపు ప్రజల కష్టాలను కళ్లారా చూసిన ఆయన పుట్టెడు దుఃఖంలో ఉన్న వారిని ఆదుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తన ఒక నెల జీతాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ఎంపీ వద్దిరాజు ప్రకటించారు.

## వరద బాధితులకు సాయం చేస్తా..

- పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి
- రాకాశితండా, బీరోలు గ్రామాల్లో నిత్యావసరాలు పంపిణీ


బందంపల్లిలో వరద బాధితులతో మాట్లాడి ధైర్యం చెబుతున్న కందాల ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 4 : వరదలతో నష్టపోయిన బాధితులకు తనవంతుగా సాయం అందిస్తానని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆకేరు వరద ప్రవాహంతో తీవ్రంగా నష్టపోయిన రాకాశితండా, రావిచెట్టుతండాలను బుధవారం ఆయన సందర్శించారు. ఇళ్లు మునిగిపోయిన బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆకేరు వరద ఉధృతి వల్ల ఇసుక మేటలు మేసిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. జల్లేపల్లి హైస్కూల్‌లోని పునరావాస కేంద్రంలో ఉన్న రాకాశితండా వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. రావిచెట్టుతండా వద్ద కొట్టుకుపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం బీరోలు చెరువు తెగి ముంపునకు గురైన బందంపల్లి దళిత కాలనీవాసులను పరామర్శించారు. బాధితులకు సాయంత్రంలోగా వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేయాలని పార్టీ శ్రేణులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాషబోయిన వీరన్న, దేవరం దేవేందర్‌రెడ్డి, నాయకులు చావా వేణు, చామకూరి రాజు, ఆలస్యం నాగేశ్వరరావు, ఆర్మీ రవి, తాతా రవీందర్, బోడ మంచానాయక్, వంచర్ల సత్యనారాయణరెడ్డి, పరికపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా బీఆర్ఎస్

- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్
- బీఆర్ఎస్ నాయకులతో కలిసి ముంపు వార్డుల సందర్శన


వాగు దాటుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 4 : భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని బుగ్గవాగు బ్రిడ్జితోపాటు మున్సిపాలిటీలోని ముంపు ప్రాంతాలైన 2, 3, 5, 20 వార్డులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె సందర్శించారు. నిర్వాసితులకు ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గత కేసీఆర్ పాలనలో వానకాలం వచ్చిందంటే ముందస్తు చర్యలు చేపట్టే వారని గుర్తు చేశారు. గత కేసీఆర్ పాలనలో బుగ్గ వాగు ప్రక్షాళనకు మాజీ మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చేశారని, ప్రస్తుతానికి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నారంటే ఆయన చలవేనని గుర్తు చేశారు. అమలుకాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ప్రజా పాలన పై అశ్రద్ధ వహిస్తుందని ఆరోపించారు. వరద నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, నాయకులు సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వరరావు, శీలం రమేష్, జేకే శ్రీనివాస్, శారద, పద్మావతి, అబ్దుల్ నబి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## వరదల్లో మృతిచెందిన దంపతుల కుటుంబసభ్యులకు చెక్కులు అందజేత


కూసుమంచి : చెక్కులను అందిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కూసుమంచి, సెప్టెంబర్ 4 : మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన యాకూబ్, సైదాబీ దంపతులు వరదల్లో మృతిచెందిన విషయం విదితమే. వారి కుటుంబసభ్యులకు బుధవారం ఖమ్మంజిల్లా కూసుమంచి మండల కేంద్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ఆర్థికసాయం చెక్కులను అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల సాయాన్ని ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున చెక్కులను యాకూబ్ సోదరుడు లాల్‌సాబ్ ఇంటి వద్ద మృతుల కుమారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వారిని బతికించాలని చాలా ప్రయత్నాలు చేశాం.. కానీ ఫలితం దక్కలేదు.. మీ కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీవో గణేశ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### షరీఫ్‌ను కాపాడిన వారికి ప్రశంసలు

వరదల్లో నాయకన్‌గూడెంలో ముగ్గురు ఇంటిపై కప్పుపై ఉండగా వారికి లైఫ్‌జాకెట్లు, ట్యూబ్‌లు అందించిన పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, వ్యవసాయ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశంసించారు. అందరి సహకారంతో ఒక ప్రాణాన్ని కాపాడుకోగలిగామన్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో హెలికాప్టర్ రాలేదనే విషయాన్ని కుటుంబ సభ్యులకు మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా వెంకటేశ్వర్లు, ఉమాదేవి


జి.వెంకటేశ్వర్లు | ఎం.సింహాచలం | కే.ఓంకార్

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 4 : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లా నుంచి కొణిజర్ల మండలం జడ్పీహెచ్ఎస్ పెద్దగోపతి పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(తెలుగు) జి వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఎంపీపీఎస్ ఆర్ఎన్ గుట్ట పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న దల్లి ఉమాదేవి ఎంపికయ్యారు. వీరికి గురువారం హైదరాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేయనున్నారు.

- కళాశాల విద్య పరిధిలో ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కే ఓంకార్ ఎంపికయ్యారు.
- జూనియర్ కళాశాల పరిధిలో ఖమ్మం జిల్లా ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఎం.సింహాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ జేఎల్‌గా పనిచేస్తున్న ఎండీ ఖుర్షీద్ అహ్మద్ ఎంపికయ్యారు.

### జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం వాయిదా..

కాగా.. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లాలో వరదలు, భారీ వర్షాల కారణంగా వాయిదా వేశారు. వరదల వల్ల ఎంతో మంది నిరాశ్రయులుగా మారారని, ఈ సమయంలో వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత కలెక్టర్ అనుమతితో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు చేయనున్నట్లు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు.

# ముందుంది మరో ముప్పు

- మళ్లీ తుపాను గండం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడి
- బిక్కుబిక్కుమంటున్న భద్రాద్రి కొత్తగూడెం ప్రజలు
- ఇప్పటికే నాలుగురోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు
- 43 అడుగులు దాటి ప్రవహిస్తున్న గోదావరి
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- కిన్నెరసానికి భారీగా వరద.. పొంగి ప్రవహిస్తున్న వాగులు
- జలదిగ్బంధంలో ఆళ్లపల్లి మండలం


ఉదయం కురిసిన భారీ వర్షానికి పొంగి ప్రవహిస్తున్న కిన్నెరసాని ప్రాజెక్టు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను వణికించిన భారీ వర్షం నుంచి జనం తేరుకోకముందే మరో తుపాను గండం ఉన్నట్లు వాతావరణశాఖ ముందస్తు సమాచారం అందించింది. దీంతో జిల్లా ప్రజలు మరింత భయాందోళన చెందుతున్నారు. గత మూడ్రోజుల క్రితం ఊహించని విధంగా అతి భారీ వర్షం కురవడంతో జిల్లాలోని మణుగూరు పట్టణం కకావికలమైంది. భారీగా నష్టం జరిగింది. పంటలు వేసుకున్న రైతులకు కూడా కోలుకోలేని దెబ్బతగిలింది. జనజీవనం చిన్నాభిన్నమైంది. చిరు వ్యాపారులు ఇంటికే పరిమితమయ్యారు. విద్యాసంస్థలు, అంగన్‌వాడీ స్కూల్స్ నీట మునిగి పోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం కోలుకోలేకపోయారు. మరోవైపు జ్వరాలు విజృంభించడంతో ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికే భారీ వర్షానికి రూ.7.50 కోట్లు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

### పొంచి ఉన్న మరో తుపాన్

వర్షాల తాకిడి నుంచి బాధితులు తేరుకోకముందే మరో తుపాను వచ్చే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేస్తున్నారు. ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. మణుగూరులో జరిగిన బీభత్సానికి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు చాకచక్యంగా వ్యవహరించి ప్రజలను రక్షించారు. అధికార పార్టీ నాయకులు దగ్గరకు రాకపోయినా యంత్రాంగం మాత్రం అప్రమత్తతతో బాధితులకు భరోసా కల్పించారు.

### భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

ఎగువ భాగాన కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి ఉరకలేస్తున్నది. ఇప్పటికే 43 అడుగులు దాటి నది ప్రవహిస్తుండడంతో కలెక్టర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున గోదావరి మరింత పెరిగే అవకాశం ఉంది. కిన్నెరసానికి కూడా భారీగా వరద నీరు చేరడంతో 9 గేట్లు ఎత్తి నీటిని వదిలారు. ప్రాజెక్టులోకి 55 వేల క్యూసెక్కుల నీరు చేరడంతో 53వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారు. తాలిపేరులో వరద చేరినప్పటికీ ప్రమాదం లేకపోవడంతో గేట్లు ఎత్తలేదు. 5,965 క్యూసెక్కుల నీటిని మాత్రమే బయటకు వదిలారు. వచ్చే నీటిని బట్టి గేట్లు తెరిచే అవకాశం ఉంది.

### జిల్లావ్యాప్తంగా మోస్తరు వాన

రెండ్రోజులుగా కురిసిన వానతోపాటు బుధవారం ఉదయం జిల్లాలో పలుచోట్ల వర్షం దంచి కొట్టింది. కొన్ని ఏరియాల్లో ముసురు వాన పట్టింది. ఆళ్లపల్లిలో 76 మిల్లీమీటర్లు, లక్ష్మీదేవిపల్లి మండలంలో 30, కరకగూడెంలో 30, దమ్మపేటలో 25, జూలూరుపాడులో 19.5, కొత్తగూడెంలో 18, గుండాల మండలంలో 17 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇతర మండలాల్లో 10 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. టేకులపల్లి మండలం మద్రాస్‌తండాలో వాగు పొంగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆళ్లపల్లిలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

### అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్

మరో రెండ్రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అప్రమత్తం చేశారు. వాగులు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లకుండా చూడాలని సూచించారు. వర్షం సమయంలో ప్రజలు బయటకు రావొద్దని కోరారు. అన్ని మండలాల్లో ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉంటారని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. వరద బాధితులకు తక్షణసాయం అందిస్తున్నామని, ఎవరూ ఆందోళనకు గురికావొద్దని పేర్కొన్నారు.


భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్న గోదావరి

### పలు గ్రామాలకు రాకపోకలకు బంద్

టేకులపల్లి, సెప్టెంబర్ 4 : గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి టేకులపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంటలు నీట మునిగాయి. మండలవ్యాప్తంగా తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోళ్లపాడు గ్రామానికి వెళ్లే రహదారికి మధ్యలో బ్రిడ్జిపై నుంచి భారీ వరద వస్తున్నది. మద్రాస్‌తండా గ్రామం నుంచి కొండంగులబోడు రహదారికి మధ్యలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

### జలదిగ్బంధంలో ఆళ్లపల్లి మండలం

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 4 : నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాయిపాడు వద్ద కిన్నెరసాని నది ఉప్పొంగి ప్రవహించడంతో ఆళ్లపల్లి మండలం జలదిగ్బంధంలో చిక్కుకుంది. బుధవారం మండలంలో సుమారు 17.8 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల ఇండ్లలోకి నీరు చేరింది. ఇంటి మట్టి గోడలు కూలిపోయాయి. రఘువాపురం పంచాయతీ చంద్రాపురం గ్రామంలోని మర్లకుంట చెరువు అలుగుకు పగుళ్లు వచ్చింది. దీంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం గ్రామం పూనెం లక్ష్మయ్యకు చెందిన రెండు దుక్కిటెద్దులు బండారుగూడెం వద్ద జల్లేరువాగులో పడి మృతిచెందాయి. కొత్తగూడెం నుంచి మర్కోడుకు ఆర్టీసీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎస్సై రతీష్ ముందస్తుగా వాగులు, వంకలు ఎవరు దాటవద్దని తమ సిబ్బందిని వాగుల వద్ద ఉంచి హెచ్చరిస్తున్నారు.

## భద్రాద్రిలో గోదావరి ఉధృతి

### మొదటి ప్రమాద హెచ్చరిక దాటిన వరద


భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్న గోదావరి

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 4 : భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం రాత్రి 9గంటలకు 40.50 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం బుధవారం మధ్యాహ్నం 1గంటకు మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులు దాటి ప్రవహిస్తోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సాయంత్రం 6గంటల సమయానికి 44.20 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. రాత్రి 10 గంటలకు 44.2 అడుగులకు గోదావరి నీటిమట్టం తగ్గింది. అధికారులు ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

### కిన్నెరసాని నుంచి 53వేల క్యూసెక్కులు విడుదల

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 4 : కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి బుధవారం 53వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కిన్నెరసాని ఎగువన ఉన్న బయ్యారం, ఇల్లెందు, టేకులపల్లి తదితర ప్రాంతాల్లో గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి వరద పెద్దఎత్తున కిన్నెరసాని ప్రాజెక్టులోకి చేరింది. మంగళవారం రాత్రి ఒకే గేటు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అర్ధరాత్రి తర్వాత ఒకేసారి 43 వేల క్యూసెక్కుల వరద వచ్చి ప్రాజెక్టులో చేరసాగింది. పూర్తిస్థాయి నీటి మట్టం 407 అడుగులు కాగా ప్రాజెక్టులో నీటిమట్టం 404.3 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో వచ్చి చేరుతున్న వరద దృష్ట్యా డ్యామ్ అధికారులు ఎనిమిది గేట్లు ఎత్తి 53వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలకు నీరు వదులుతున్నట్టు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు.

## ఏ ఒక్కరూ అధైర్యపడొద్దు

- వరద బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఖమ్మం జిల్లాలో ప్రాథమిక అంచనాలో 7,500 ఇళ్లు మునిగాయి
- అందులో నగరంలోనే 5 వేల ఇళ్లు ముంపునకు గురయ్యాయి
- సమావేశంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, సెప్టెంబర్ 4: ఖమ్మం జిల్లాలో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా నిరాశ్రయులైన బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని సూచించారు. ఖమ్మంలోని కేఎంసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకస్మాత్తుగా వచ్చిన మున్నేరు వరదల కారణంగా ఖమ్మం నగరంలో సుమారు 5 వేల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో మరో 2,500 ఇళ్లు కలిపి మొత్తం 7,500 ఇళ్లు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వివరించారు. అధికారులు ఇంకా క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్నారని, మరో రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదికలు వస్తాయని అన్నారు. గడిచిన వందేళ్లలో మున్నేటికి ఇంత వరద ఎన్నడూ రాలేదని అన్నారు. అయినప్పటికీ ఒక్క ప్రాణనష్టమూ జరుగకుండా కలెక్టర్, సీపీ సహా ఇతర అధికారులు చర్యలు తీసుకున్నారని అన్నారు. వారి కృషిని అభినందిస్తున్నట్లు చెప్పారు. అలాగే, వరద ముంపు ప్రాంతాల్లో శానిటేషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని తుమ్మల వివరించారు. ప్రతి ఇంటికీ నిత్యావసర సరుకులు ఇస్తున్నామని, అవసరమైతే రెండోసారి కూడా పంపిణీ చేస్తామని అన్నారు. గురువారం నుంచి బాధితుల ఖాతాల్లో నగదును జమచేస్తామన్నారు. వరద తెచ్చిన బురదను తొలగించేందుకు 100 ట్రాక్టర్లు, 50 జేసీబీలు, 70 ట్యాంకర్లు పనిచేస్తున్నాయన్నారు. పునరావాస కేంద్రాలను మరికొద్ది రోజుల వరకూ కొనసాగిస్తామన్నారు. చాలా వరకు విద్యుత్ మీటర్లు తడిచినందున వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు అందిస్తున్నాయన్నారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ పాల్గొన్నారు.


## మంత్రి చెప్పినా.. అందని సాయం

- రాకాశితండా వరద బాధితుల ఆవేదన
- కట్టుబట్టలతో నిరాశ్రయులైన తండావాసులు
- కంటితుడుపుగా మంత్రి పొంగులేటి పర్యటన


ఆకేరు ప్రవాహానికి నీట మునిగిన రాకాశితండా దుస్థితి

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 4 : 'ఆకేరు వరద ప్రవాహం తమ తండాను అతలాకుతలం చేసింది. సర్వం కోల్పోయేలా చేసింది. కట్టుబట్టలతో మిగిల్చింది. ఇంత జరిగినా ప్రభుత్వం నుంచి ఆదుకునేవారు కరువయ్యారు. మంత్రి పొంగులేటి వచ్చి ఆదేశాలిచ్చినా పట్టించుకునేవారు లేరు' అంటూ మండలంలోని రాకాశితండా వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో ఆకేరు ఉగ్రరూపం దాల్చడంతో రాకాశితండా పూర్తిగా నీట మునిగిన విషయం తెలిసిందే. వరదలతో పంటలు, ఇంటి సామగ్రి, బియ్యం, ఇతర వస్తువులు కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలామని, తమ తండాను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించి అధికారులను ఆదేశించినా.. ఇంతవరకు ఎలాంటి సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రంలో ఉంచి ఆహారం మాత్రం అందిస్తున్నారని తెలిపారు.

### ఎలాంటి సాయం అందలే..



ఆకేరు వరదతో మా తండా మునిగిపోయి కట్టుబట్టలతో వచ్చాం. ఇళ్లలోని సామాన్లు, తిండి గింజలన్నీ కొట్టుకుపోయాయి. మమ్మల్ని జల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉంచి అన్నం పెడుతున్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి, అధికారులు వచ్చిపోయారు తప్ప మాకు ఎవరు ఇంతవరకు సాయం చేయలేదు.

–బానోత్ శారద, వరద బాధితురాలు, రాకాశితండా

### తాగడానికి నీళ్లు కూడా లేవు..



నీళ్లలో నుంచి తండా బయటపడి మూడు రోజులైంది. ఇళ్లలో బురద అట్లనే ఉంది. ఇళ్లు కడుక్కోవడానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. తాగడానికి మంచినీళ్లు పంపిన నాధుడు లేడు. కనీసం వండుకొని తినడానికి వంట సామాన్లు లేవు. తండాలో కరెంటు రాలేదు. పత్తి పంట కొట్టుకుపోయింది. ఎలా బతకాలో అర్థం కావట్లేదు.

– శ్రీదేవి, వరద బాధితురాలు, రాకాశితండా

### మంత్రి చెప్పినా న్యాయం జరగట్లే..



ఆకేరు వరదతో రెండున్నర ఎకరాల్లో మిరప, వరి పొలం నాశనమైంది. ఇళ్లలో వస్తువులన్నీ పాడైపోయాయి. మా తండాలో అందరి పరిస్థితి ఇలాగే ఉంది. పంట భూముల్లో మేటలు వేసి పనికి రాకుండా రాళ్లు తేలాయి. తండా మంత్రి వచ్చి చెప్పినా ఎలాంటి సహాయం అందలేదు.

– బోడ కౌసల్య, వరద బాధితురాలు, రాకాశితండా







